క్లుప్తంగా

విద్యా కానుక కిట్ల పంపిణీ



వాహనాలను జెండా ఊపి, ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గోపీనాథ్

వాకాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్ పాల్గొని, విద్యా కానుక కిట్లను తరలిస్తున్న వాహనాలను జెండా ఊపి, ప్రారంభించారు. ఎంఈఓ బాబు మాట్లాడుతూ మండలంలో 3,572 మంది విద్యార్థులకు సంబంధించి జగనన్న ప్రభుత్వం ముందుగానే జగనన్న విద్యా కానుక కిట్లను అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ బాబు పాల్గొన్నారు.

కిట్ల పరిశీలన

దొరవారిసత్రం: ఎమ్మార్సీకి చేరిన జగనన్న విద్యాకానుక కిట్లను తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ సింగయ్య సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే బూట్లు, బ్యాగులు, బెల్ట్ తదితర అన్ని వస్తువులు చాలా బాగున్నాయన్నారు. మండలంలోని 3,824 మంది విద్యార్థులకు విద్యాకానుకతో పాటు పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ఎంఈఓ మస్తానయ్య తెలిపారు.

ఘనంగా పొంగళ్లు

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు, మొండికట్టరాజుపాళెం గ్రామాలకు గ్రామదేవత ముంగమూరమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. మూడు రోజులుగా ముంగమూరమ్మ వారి కోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి విశేషాలంకరణ, అభిషేకాలు, హారతులిచ్చి పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులంతా ఊరేగింపుగా పొంగళ్ల సామగ్రి తీసుకొచ్చి పొంగళ్లుపెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. బాలాయపల్లి మండలం నిండలి గ్రామానికి చెందిన యల్లం రాజు ప్రసాద్‌రాజు, శివకుమార్‌రాజు కుటుంబ సభ్యులు వెండిపాదాలు, వెండి భూషణాలు వితరణ చేశారు. నాయుడుపేట మండలం కోనేటి రాజుపాళెం గ్రామానికి చెందిన కొండూరు నందకిశోర్ వెండి గొడుగు, పల్లెం బహూకరించారు. ఆర్మేనిపాడు కుమ్మరిపాళేనికి చెందిన పనబాక మహేష్ అమ్మవారికి వెండికిరీటం, బంగారు కళ్లు బహూకరించారు. చెన్నై నగరానికి చెందిన స్వామినాథన్, సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు అమ్మవారి ఉత్సవాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

కోట: మండలంలో నాడు-నేడు రెండో విడత పనులను ఈ నెల 12వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంఈఓ వెంకటసునీల్ హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం నాడు-నేడు పనుల పురోగతిపై హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 29 పాఠశాలల్లో వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సీనియర్ ఏపీపీగా లక్ష్మీనారాయణ

గూడూరు: స్థానిక ఏజేఎంఎఫ్సీ కోర్టు సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వీ లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సూళ్లూరుపేట, నెల్లూరు, వెంకటగిరి, ఒంగోలులో సీనియర్ ఏపీపీగా బాధ్యతలు నిర్వహించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన గూడూరుకు వచ్చారు.

ఆరోగ్యంపై సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

రాపూరు: మండలంలోని కోటూరుపాడులో సోమవారం సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించినట్లు వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థ ప్రతి ఐదేళ్లకోసారి గ్రామాల్లో సర్వే చేస్తుందన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సైదాపురం: మండల కేంద్రంలోని వీధుల్లో మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది ర్యాలీ చేశారు. మండల వైద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ ఇళ్లలో దోమలు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గూడూరు: మాట్లాడుతున్న జడ్జి సుల్తానా బేగం



వెంకటగిరి: మొక్క నాటి నీరు పోస్తున్న దొంతు శారద

గూడూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని నెల్‌క్యాస్ట్ పరిశ్రమలో సోమవారం కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువగా పాలిథిన్ వినియోగంతో పర్యావరణానికి తీరని ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, పార్వతయ్య, తాజుద్దీన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

వెంకటగిరి: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. పట్టణంలోని 14, 15 వార్డుల సచివాలయంలో సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శివాలయం వీధి సచివాలయంలో కౌన్సిలర్లు ధనియాల రాధమ్మ, కాసా కృష్ణమూర్తి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రామయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా తీసుకోండి

చిల్లకూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పసుపులేటి సురేష్ బాబు సూచించారు. మండలంలోని జిందాల్ సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకు ముందు తమ్మినపట్నంలో ర్యాలీ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులకు పర్యావరణంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు కే శ్రీనివాసరావు, ఎస్ఏ మన్సూరీ, సరోజ్‌ఫాథి, దిలీప్‌కుమార్ పంతక్, డాక్టర్ గోపాలకృష్ణ పాణి, సీఎస్ఆర్ హెడ్, మాథ్యు, రషీద్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు పచ్చదనంతో నిండాలి

పర్యావరణం కాపాడే క్రమంలో పల్లెలు పచ్చదనంతో నిండాలని డీపీఓ వెంకటరమణ సూచించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లె సచివాలయ పరిధిలో సోమవారం పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మాణిక్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపాచిలో పర్యావరణ దినం

తడ: మాంబట్టు సెజ్‌లోని అపాచీ బూట్ల పరిశ్రమలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై కార్మికులకు అవగాహన కల్పించారు. పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. జీఎం సర్‌జియోలీ, వీజీఎం ముత్తుగోవిందస్వామి, పీఆర్వో మోహన్, షరీఫ్ పాల్గొన్నారు.

డక్కిలిలో..

డక్కిలి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని డీఆర్వో కోటేశ్వరరావు తెలిపారు. డక్కిలిలో సోమవారం పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణం కలుషితం కావడంతో మానవ మనుగడకు అవరోధాలు ఏర్పడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంతో పాటు ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అమలు చేయాలన్నారు.

ప్రతి ఒక్కరి బాధ్యత

రాపూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ రాపూరు రేంజ్ అధికారి రవీంద్రబాబు అన్నారు. సోమవారం మద్దెలమడుగు సెంటర్ నుంచి రాపూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పలు నష్టాలు కలుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫారెస్ట్ కార్యాలయం ఆవరణలో సోమవారం అధికారులు వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, పాల్గొన్నారు.



తడ: మొక్క నాటుతున్న అపాచీ ప్రతినిధులు



రాపూరులో బైక్ ర్యాలీ చేస్తున్న అటవీశాఖాధికారులు

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



హిటాచీని అడ్డుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు: అటవీ భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వేందుకు తీసుకువచ్చిన హిటాచీలను గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన సోమవారం చిల్లకూరు మండల తొణుకుమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 17లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోట మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల కోసం రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారని చెబుతూ అక్రమంగా గ్రావెల్ తరలించే ప్రయత్నం చేసేందుకు కొంత మంది పూనుకున్నారు. దీనిని గమనించిన స్థానికులు వారిని అడ్డుకుని కోట మండలంలో పలు ప్రాంతాల్లో గ్రావెల్ ఉండగా పక్కనే ఉన్న చిల్లకూరు మండలంలో గ్రావెల్‌ను ఎందుకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకున్నారని వారిని ప్రశ్నించారు. దీంతో అక్కడ గ్రామస్తులు, అక్రమార్కుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ త్రివిక్రమ్ భూపతి అక్కడుకు చేరుకుని గ్రావెల్ తరలించేందుకు ప్రయత్నించిన వారితో మాట్లాడగా వారు స్థానిక రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారని చెప్పారు. దీంతో అనుమతులకు సంబంధించిన పత్రాలను చూపించాలని అడుగ్గా, మౌకికంగా చెప్పారని అన్నారు. దీంతో తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్‌కు ఫోన్ చేసేందుకు సర్పంచ్ ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో లారీలు, హిటాచీలను అక్కడ నుంచి వెనక్కి పంపేశారు.

డక్కిలి ఎంపీడీఓగా ప్రసన్నకుమారి



ప్రసన్నకుమారి

డక్కిలి: ఎంపీడీఓగా టీ ప్రసన్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు బదిలీపై వెళ్లారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండల సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ప్రసన్నకుమారి ఉద్యోగోన్నతిపై డక్కిలి ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

భూ ఆక్రమణలపై విచారణ

కోట: వంజివాక రెవెన్యూ పరిధిలో భూ ఆక్రమణలపై సోమవారం విజిలెన్స్ అధికారులు కోట తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. వంజివాకలో ఓ దేవాలయానికి చెందిన భూమి 69 సెంట్లు ఆక్రమణకు గురైందన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రికార్డులు పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బట్టివిడత కాలనీకి చెందిన మేకల గురువయ్య (48) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బట్టివిడత కాలనీకి చెందిన గురువయ్య కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుంటాడు. రోజూ కల్లు సేవించి వచ్చి, భార్య మణేమ్మతో వివాదానికి దిగుతుండడంతో తరచూ వారి మధ్య వివాదాలు చోటు చేసకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం కూడా అతిగా కల్లు తాగి రావడంతో భార్యాభర్తల మధ్య వివాదం జరిగింది. భార్యపై కోపంతో గురువయ్య గుళికలు మందు కలుపుకుని తాగాడు. నోట్లో నురగ వస్తుండడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి అల్లుడు వేణు పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణు తెలిపారు.

మొక్కలు నాటిన మహిళా క్లబ్ సభ్యులు



మొక్కలు నాటుతున్న మహిళా క్లబ్ సభ్యులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిందాల్ పరిశ్రమ మహిళా క్లబ్ సభ్యులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందులో తొలి అడుగు వేస్తూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తామే తీసుకుంటున్నట్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లోని మహిళలను చైతన్య పరిచేందుకు సభ్యులు ఒక్కొక్కరు ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని, వారికి ప్రభుత్వం ద్వారా రావాల్సి సంక్షేమ పథకాలను అందించడం, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి, వారి స్థితి గతులను మార్చుకునేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో సప్లమెంటరీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా క్లబ్ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, రేస్ స్కూల్ అధినేత బాలచెన్నయ్య, పరిశ్రమ ప్రతినిధి మాథ్యు, తదితరులు పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పేకాటరాయుళ్లతో ఎస్ఈబీ సీఐ ప్రసాద్, సిబ్బంది

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీ వద్ద ఓ పాడుబడిన ఇంటి వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్ఈబీ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ పేకాడుతున్న అదే ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2700 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పేకాటరాయుళ్లను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, పూచికత్తుపై విడుదల చేశారు. ఈ దాడుల్లో సీఐతో పాటు నాయుడుపేట ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఈబీ పోలీసులు జీ రాజయ్య, ఎం తిరుమలరావు, ఏ శ్రీరాములు, డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోహినీ ఉత్సవం



గజ, సింహ వాహనాలపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామివారు



మోహినీ అలంకారంలో స్వామివారు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని కరిమాణిక్య స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామవారు చప్పరంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన. సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామివారి కల్యాణోత్సవం టీటీడీకి చెందిన ఆగమ పండితులు మణికంఠచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు శ్రీదేవి భూదేవి ఉత్సవమూర్తులను సింహవాహనంపై, కరిమాణిక్య స్వామి వారిని గజవాహనంపై ఊరేగింపుగా కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈఓ శాంతి, సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



రోసనూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పెళ్లకూరు: జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం రోసనూరు, రాజుపాళెం, కృష్ణప్పకండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాబు మాటలను పట్టించుకోకుండా పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం ఉంచాలన్నారు. 40 ఏళ్ల రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ రూ.లక్షల కోట్లు దోచేసిన చంద్రబాబు మహానాడు వేదికగా విడుదల చేసిన అబద్ధాల మేనిఫెస్టోని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌డ్డి, సర్పంచ్ శనగ రాజయ్య, ఎంపీటీసీ సభ్యురాలు టీ సుజాత, పార్టీ మండల కన్వీనర్ ఎం సుధాకర్, కే రఘునాయుడు, ఎం సోమశేఖర్‌రెడ్డి, కే రామకృష్ణంరాజు, కే అమరేంద్రరెడ్డి, ఓ వినోద్‌కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



రాపూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుభాషిణి

రాపూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ సుభాషిణి తెలిపారు. రాపూరు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీర్రాజులు, ఏఈలు వాసు, ఆంజనేయులు, సర్దార్, కార్తీక్, ఏఓ సోమసుందర్ పాల్గొన్నారు.

సైదాపురం: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శేషాద్రి, భాస్కర్, ఏఓ శివకుమార్, ఏఓ హైమావతి, ఎంఈఓ దయాకర్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

మైదాన వసతి కల్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తంబిరెడ్డి

నాయుడుపేట: క్రీడా మైదానం వసతి కల్పించాలని మండలంలోని బిరదవాడకు చెందిన విద్యార్థులు, యువతతో కలసి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. బిరదవాడలో పలువురు క్రీడాకారులు, విద్యార్థులు ఉన్నారని వారు క్రీడా సాధన చేసుకోవడానికి అనువుగా గ్రామానికి సమీపంలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని విన్నవించారు. వారి వెంట విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కేవీ రమణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

వెంకటగిరిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పలుశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి రూరల్ మండలం సిద్ధవరంలో చెరువు పంటకాలువను పూడ్చివేసి నిర్మాణాలు సాగిస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని స్థానికులు అర్జీ సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలో కాలేజీ మిట్ట, 16వ వార్డు, కుమ్మరిగుంటలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పలువురు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఎస్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథస్వామి వార్షికోత్సవం

వెంకటగిరిరూరల్: మండలంలోని పారవోలులో ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వనాథస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, నేవైద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. రుద్రాభిషేకం, విశేషపూజలు జరిపారు. అనంతరం అన్నపూర్ణదేవి సమేత విశ్వనాథస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం జరిపారు. ఆలయం ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

గజవాహనంపై ప్రసన్న వెంకన్న విహారం



విశేషాలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

గూడూరు: రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి గజవాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర స్థలాల సందర్శనకు ప్రభుత్వ అండ



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న క్రైస్తవ సంఘం ప్రతినిధులు

చిల్లకూరు: రాష్ట్రంలోని పేద క్రైస్తవులు, ముస్లింలు వారికి పరమ పవిత్రమైన జెరూషలేం, మక్కాల సందర్శనకు ప్రభుత్వం అండగా నిలిచి వారికి ఆర్థిక సాయం చేస్తుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మండలంలోని తీపనూరులో ఉన్న కృపా ప్రార్థనా మందిరం 8వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక కూడికలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద, క్రైస్తవులు, ముస్లింలు పవిత్ర స్థలాలైన జెరూషలేం, మక్కాకు వెళ్లాలని అనుకుంటారని, అయితే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి అండగా నిలిచి ప్రభుత్వం రాయితీ కల్పించి పవిత్ర స్థలాలను చూసే అవకాశం కల్పిస్తుందన్నారు. అలాగే సంఘ కాపరులకు ఏడాదికి ఒకసారి నగదు చెల్లించి వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవులు కూడా వైఎస్సార్‌సీపీని ఆదరించి మరోసారి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చూసుకునేలా సహకారం అందించాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సంఘం ప్రతినిధులు మేరిగ మురళీధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ కుమార్, సంఘ కాపరి జె కిషోర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వలతోనే దోమల ఉధృతి



వెంకటగిరిలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

వెంకటగిరి: ఇళ్ల పరిసరాల్లో మురుగునీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయని పాతకోట అర్బన్ ప్రైమరీహెల్త్ సెంటర్ వైద్యాధికారి మణిదీప్ ముఖర్జీ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో దోమల నివారణకు మందు పిచికారి చేయించారు. అనంతరం దోమతెరలు వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచే కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సత్యవేణి, రబ్బానీ బాషా, వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.